సాక్షి కర్నూలు
బుధవారం, 3, జూలై, 2024



టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. డ్యామ్ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో మంగళవారం ఇన్‌ఫ్లో 13,410 క్యూసెక్కులకు పెరిగింది.



భక్తులకు హెచ్చరిక

మహానంది: ఆలయం వెనుకవైపు చిరుత సంచరిస్తుండటంతో దర్శనానికి వచ్చే భక్తులను అప్రమత్తం చేస్తూ దేవస్థానం అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి, బయలు వీరభద్ర స్వామి వార్లకు మంగళవారం శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు విశేష పూజలను నిర్వహించారు.

న్యూస్‌రీల్

భక్తులకు నిజ బృందావన దర్శనం



తులసీమాల ధారణలో రాఘవేంద్రుల మూలబృందావనం

మంత్రాలయం: పవిత్ర ఏకాదశి సందర్భంగా భక్తులకు రాఘవేంద్రుల నిజ బృందావన దర్శనం కల్గింది. ఆనవాయితీలో భాగంగా మంగళవారం రాఘవేంద్రుల మూల బృందావనానికి అలంకరణలు, అభిషేకాలు, పూజలకు విరామం పలికారు. బృందావనాన్ని సన్యాసి వస్త్రం, తులసీ మాలధారణతోనే మాత్రమే గావించారు. ఎంతో పవిత్ర దినంగా భక్తులు రాఘవేంద్రస్వామిని దర్శించుకుని సేవలో తరించారు. బ్రాహ్మణులు, సేవా భక్తులు, అర్చకులు ఉపవాస దీక్షలో కొనసాగారు.

రీ వెరిఫికేషన్‌కు అవకాశం

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఏవైనా సందేహాలు ఉంటే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశముందని డీఈఓ కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు 906 మంది హాజరు కాగా 152 మంది మాత్రమే ఉత్తీర్ణులు (16.78 శాతం) అయ్యారన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు 1,250 మంది రాయగా 527 మంది పాసయ్యారన్నారు. టెన్త్, ఇంటర్మీడియెట్ ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి రీ కౌంటింగ్‌కు రూ.200, రీ వెరిఫికేషన్ ఒక్కో సబ్జెక్టుకు రూ.1,000 చెల్లించాలన్నారు. ఇందుకు ఈ నెల 13వ తేదీ వరకు గడువు ఉందని, ఫలితాలను www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునన్నారు. ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

హిజ్రాలకు గుర్తింపు కార్డులు

కర్నూలు(అర్బన్): జిల్లాలో నివాసం ఉంటున్న హిజ్రాలకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు వాటిని పొందని వారు http://transgender.dosje.gov.in వెబ్‌సైట్‌లో తమ ఆధార్‌కార్డు, నోటరీ అఫిడవిట్‌ను పొందుపరిస్తే జిల్లా కలెక్టర్ ద్వారా ధ్రువపత్రాలు, గుర్తింపుకార్డులను అందిస్తామన్నారు. అలాగే ఆధార్‌కార్డు లేని వారు ఆధార్ సేవా కేంద్రాల ద్వారా పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 08518-277864 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లాకు 23వ స్థానం

- 8వ స్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా
- రెండవ రోజు సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ రెండవ రోజు కూడా సచివాలయాల్లోనే కొనసాగింది. సోమవారం రాత్రి పొద్దుపోయే సమయానికి కర్నూలు జిల్లాలో 93.29 శాతం, నంద్యాల జిల్లాలో 95.48 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినా కార్యాచరణలో విఫలమవడం గమనార్హం. 30 శాతం వరకు ఇంటి దగ్గరే పంపిణీ చేయగా, మిగిలిన పింఛన్లు సచివాలయాలు, రచ్చబండల దగ్గర పంపిణీ చేసినట్లు స్పష్టమవుతోంది. అనేక మంది పింఛనుదారులు మంగళవారం సచివాలయ సిబ్బందికి ఫోన్ చేయగా ఇక్కడికే వచ్చి తీసుకోండని చెప్పడంతో నివ్వెరపోయారు. మంగళవారం సాయంత్రం 6.45 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,45,229 పింఛన్లు ఉండగా 2,42,664 పింఛన్లు పంపిణీ చేశారు. 98 శాతం పింఛన్ల పంపిణీతో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 23వ స్థానంలో నిలిచింది. నంద్యాల జిల్లాలో 2,21,240 పింఛన్లు ఉండగా 2,19,187 పింఛన్లు పంపిణీ చేశారు. ఈ జిల్లా 99.07 శాతం పంపిణీతో 8వ స్థానంలో నిలిచింది.

☛ కర్నూలు జిల్లా పింఛన్ల పంపిణీలో వెనుకబడటాన్ని కలెక్టర్ రంజిత్‌బాషా తీవ్రంగా పరిగణిస్తున్నారు. సంబంధిత ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లోనే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాల్సి ఉండగా కర్నూలు జిల్లాలో ఇంకా 2,565 మంది పింఛను తీసుకోని పరిస్థితి. వీరిలో చాలా మంది ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్లు ఇస్తారనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంటి దగ్గరకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయకపోవడం వల్ల అనేక మంది జూలై నెల పింఛను కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.



ఆదోని జగనన్న కాలనీలో ఆగిన గృహ నిర్మాణాలు

'పేదింటి'పై శీతకన్ను!

జిల్లాలో పక్కా గృహ నిర్మాణాలకు బ్రేక్

- పేదల గూటిపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- నెల రోజులుగా నిలిచిపోయిన బిల్లుల చెల్లింపులు
- వెబ్‌సైట్‌లో మార్పులంటూ జాప్యం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.457.29 కోట్ల చెల్లింపులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో చురుగ్గా జరుగుతున్న గృహ నిర్మాణాలపై రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. వేర్వేరు దశల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే వారం రోజుల క్రితం వరకు బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు కూడా వీలు లేకుండా సర్వర్‌ను లాక్ చేసినట్లు సమాచారం. అలాగే బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు, విడుదల చేసేందుకు ఇప్పటి వరకు ఉపయోగించిన వెబ్‌సైట్‌ను మారుస్తున్నట్లు చెప్పడం వల్ల తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. జిల్లాలోని 303 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మొత్తం 37,550 గృహ నిర్మాణాలు చేపట్టగా, ఇప్పటి వరకు 17,067 గృహాలు పూర్తయ్యాయి. ఈ గృహాల్లో లబ్ధిదారులు జీవనం కూడా చేస్తున్నారు. మిగిలిన గృహాలు వేర్వేరు దశల్లో కొనసాగుతున్నాయి. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం జూన్ నెల 4వ తేది నుంచి నిర్మాణాలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. వెబ్‌సైట్‌లో మార్పులు చేయాలంటూ బిల్లులు నిలుపుదల చేయడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ నెల 2న వెబ్‌సైట్ పనిచేస్తున్నట్లు చెబుతున్నా, సాంకేతిక కారణాల వల్ల కేవలం ఒక గంట మాత్రమే పనిచేసినట్లు సమాచారం.

వెబ్‌సైట్‌లో మార్పులంటూ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వినియోగించిన గృహ నిర్మాణ శాఖ వెబ్‌సైట్ లాగిన్‌ను ప్రస్తుత ప్రభుత్వం లాక్ చేసింది. దీంతో వేర్వేరు దశల్లో పూర్తయిన గృహాలకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు వీలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా జిల్లాలోని మెజారిటీ కాలనీల్లో గృహ నిర్మాణాలకు బ్రేక్ పడినట్లయింది. అయితే జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణాలపై మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 457.29 కోట్ల చెల్లింపులు

'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా కొత్త ప్రభుత్వం కొలువుదీరక ముందు వరకు గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ముడిసరుకుతో (సిమెంట్, స్టీల్, ఇసుక తదితరాలు) కలిపి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొత్తం రూ.457.29 కోట్లు చెల్లించారు. అలాగే స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు గృహాలు నిర్మించుకునేందుకు వీలుగా పట్టణ ప్రాంతాల్లో మెప్మా, గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ ద్వారా ఒక్కొక్కరికి రూ.35 వేల ప్రకారం మొత్తం రూ.127 కోట్లను అందించారు. ఇక పీఎంఏవై కింద గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు రూ.41.34 కోట్లను చెల్లించారు.



తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామంలో ఆగిన గృహ నిర్మాణాలు

జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాల వివరాలు (నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు)

మొత్తం వైఎస్సార్ జగనన్న కాలనీలు	303
మంజూరైన గృహాలు	37,550
పూర్తి అయినవి	17,067
బీబీఎల్	3,686
పైల్ కాంక్రీట్ లెవెల్	270
ప్లింత్‌భీమ్	672
బేస్మెంట్ లెవెల్	8,709
లెంటల్ లెవెల్	1,036
రూఫ్ లెవెల్	1,921
ఆర్‌సీ లెవెల్	4,158
నిర్మాణాలు ప్రారంభించనవి	31

పీఎంఏవై (గ్రామీణ్) కింద చేపట్టిన గృహ నిర్మాణాలు

మంజూరైన గృహాలు	12,583
పూర్తి అయినవి	1,558
వేర్వేరు దశల్లో	11,025

బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం



గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు కొనసాగిన సర్వర్‌ను చెక్ చేస్తున్నారు. కొనసాగుతున్న నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బిల్లులు చేస్తున్నాం. ఈ నెల 8న గృహ నిర్మాణ శాఖ మంత్రి ఆధ్వర్యంలో సమావేశం జరగనుంది. ఆ సందర్భంగా తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా చర్యలు చేపడతాం.

– సిద్ధలింగమూర్తి, పీడీ, హౌసింగ్

జాతీయ పోటీలకు ఎమ్మిగనూరు విద్యార్థిని



విద్యార్థిని సయ్యద్ రిహానకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని సయ్యద్ రిహాన జాతీయ పర్వతారోహణ పోటీలకు ఎంపికైంది. మూగ, చెవుడు వైకల్యం వున్న ఈ విద్యార్థిని గత నెల 7 నుంచి 11వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లా గండిపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి దివ్యాంగుల అడ్వెంచర్స్ స్పోర్ట్స్‌లో ట్రెక్కింగ్, రాంప్లింగ్, హైకింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓలు ఆంజినేయులు, మధుసూదన్‌రాజు, హెచ్‌ఎం కృష్ణమూర్తి తదితరులు విద్యార్థిని రిహానను అభినందించి సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని విజయలలిత, భవిత ఐఈఆర్టీ ఉపాధ్యాయులు బాబు, సుబ్రహ్మణ్యం, పీడీ నాగేశ్వరి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నిరాశే!

- 2వ తేదీ నాటికి 25 శాతం మందికి కూడా పడని వేతనాలు

కర్నూలు(అగ్రికల్చర్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమపై అపారమైన ప్రేమ కనబరుస్తారని, 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తారని ఉద్యోగులు నమ్మారు. ఇతర ప్రయోజనాలపైనా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వచ్చిన మొదటి 1వ తేదీన ఏ ఒక్కరికీ వేతనాలు బ్యాంకు ఖాతాలకు జమ కాకపోవడం నిరాశను మిగిల్చింది. 2వ తేదీన పోలీసులు, ట్రెజరీ ఉద్యోగులకు మాత్రమే వేతనాలు జమ అయ్యాయి. దీంతో ఏదో అనుకుంటే మరేదో అవుతోందనే అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో సహా మొత్తం ఉద్యోగులు 60 వేల మంది వరకు ఉన్నారు. వీరిలో 25 శాతం మందికి కూడా వేతనాలు బ్యాంకు ఖాతాలకు విడుదల చేయలేదు. పెన్షన్‌దారులదీ ఇదే పరిస్థితి కావడం గమనార్హం.

ఏసీబీ డీఎస్పీ పోస్టుకు పెరిగిన పోటీ

కర్నూలు: అవినీతి నిరోధక శాఖ కర్నూలు రేంజ్ డీఎస్పీ పోస్టు కోసం భారీగా పోటీ నెలకొంది. గతంలో కర్నూలులో పనిచేసిన నలుగురు అధికారులు ఈ సీటు కోసం పోటీ పడుతున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏసీబీ డీఎస్పీగా ఉన్న వెంకటాద్రి ఎన్నికల ముందు తిరుపతికి బదిలీ కావడంతో ఈ స్థానం ఖాళీ అయింది. అనంతపురం జిల్లా ఏసీబీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పోస్టు ఖాళీగా ఉండటంతో గతంలో పనిచేసిన నాగభూషణంతో పాటు కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం (కర్నూలు)లో పనిచేస్తున్న సీతారాం, ప్రస్తుతం అమరావతి లూప్‌లైన్ విభాగంలో పనిచేస్తున్న తేజేశ్వరరావు ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తేజేశ్వరరావు గతంలో కర్నూలులో సీఐగా పనిచేసి పదోన్నతిపై బదిలీ అయ్యారు. వచ్చే ఏడాది ఈయన పదవీ విరమణ పొందనున్నందున కర్నూలు ఏసీబీ విభాగానికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అలాగే ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధమున్న మరో అధికారి కూడా ఈ సీటు కోసం ప్రయత్నిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అలాగే ఇక్కడ ఆరుగురు సీఐలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం కృష్ణారెడ్డి, కృష్ణయ్య, వంశీనాథ్ మాత్రమే పనిచేస్తున్నారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన తేజేశ్వరరావు డీఎస్పీగా పదోన్నతి పొంది బదిలీ కావడం, ఇంతియాజ్ బాషా కర్నూలు టూటౌన్‌కు, శ్రీనాథ్‌రెడ్డి కడప జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ప్రస్తుతం ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు మాత్రమే ఈ విభాగంలో పనిచేస్తున్నారు. అలాగే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న కృష్ణకాంత్ కూడా బదిలీ కావడంతో అదనపు ఎస్పీ నాగరాజు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



కర్నూలులోని రేంజ్ ఏసీబీ కార్యాలయం

ఏపీఎస్పీలో రెండు పోస్టులు ఖాళీ

కర్నూలు కేంద్రంగా ఉన్న ఏపీఎస్పీ మూడవ రేంజ్ డీఐజీగా ఉన్న సీహెచ్ వెంకటేశ్వర్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందారు. అలాగే ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు ఈ ఏడాది మేలో పదవీ విరమణ పొందారు. ఈ రెండు స్థానాలు కూడా ఖాళీగా ఉన్నాయి. అలాగే ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు సంబంధించి ముఖ్యమైన కేసులు దర్యాప్తు చేసే సీఐడీ విభాగ ప్రాంతీయ కార్యాలయం కర్నూలులో ఉంది. ప్రాంతీయ ప్రధాన అధికారిగా అదనపు ఎస్పీ స్థాయి అధికారి ఉండాలి. అయితే రేండేళ్ల క్రితం ప్రాంతీయ అధికారిగా ఉన్న పీఎస్ బాబు పదవీ విరమణ పొందడంతో ఆ స్థానం ఇప్పటివరకు భర్తీ కాలేదు.డీఎస్పీస్థాయి అధికారే ఇన్‌చార్జి ప్రాంతీయ అధికారిగా వ్యవహరిస్తున్నారు. నెలరోజుల క్రితం కొలువుదీరిన కూటమి ప్రభుత్వం పోలీసు శాఖలో బదిలీలతో పాటు ఖాళీగా ఉన్న కీలక స్థానాలను భర్తీ చేసే దిశగా కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆశావహులు పోస్టింగుల కోసం ప్రభుత్వ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసు అధికారుల్లో చర్చ జరుగుతోంది.

ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్న కూటమి

- కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు మరుగుపడిన ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. మంగళవారం కల్లూరులోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ గడివేముల మండలం ఒండుట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజర్ల రవీంద్రారెడ్డిపై టీడీపీ నాయకుల దాడి సంఘటన దారుణమన్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు న్యాయం చేయాలనే కానీ ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేశామని, ఇటువంటి దాడులు చేయలేదన్నారు. అనంతరం ఒండుట్ల గ్రామం నుంచి వచ్చిన దాదాపు 200 మందితో కాటసాని మాట్లాడి ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని సూచించారు.



ఒండుట్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న కాటసాని

వైఎస్‌ఆర్‌సీపీ నాయకులపై దాడులను అడ్డుకోండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులను అడ్డుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. కొత్తగా వచ్చిన కలెక్టర్‌ను మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన కార్యాలయంలో పార్టీ తరఫున మర్యాదపూర్వకంగా కలిశారు. బొకేను అందజేసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు చేసే వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసి చట్టంప్రకారం శిక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు పల్లవి, అర్షియా ఫర్హీన్, గోశాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, నాయకులు గడ్డం రామకృష్ణ, కరుణాకర రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్ రంజిత్‌బాషాకు బొకే అందజేస్తున్న సిట్రా సత్యనారాయణమ్మ, తదితరులు

కేవీఆర్‌కు స్టార్ కాలేజీ హోదా

కర్నూలు సిటీ: నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల స్టార్ కాలేజీ హోదాకు ఎంపికైనట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ వారు తమ కాలేజీకి స్టార్ కాలేజీ హోదా ఇచ్చారన్నారు. ఈ హోదా రావడం వలన బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ విభాగాల ల్యాబ్‌లలో మౌలిక సదుపాయాలతో పాటు, సరికొత్త ఆవిష్కరణలకు, సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించుకునేందుకు నిధులు మంజూరు చేస్తారన్నారు. స్టార్ హోదా రావడంతో వరుసగా మూడేళ్ల పాటు కేంద్ర బయోటెక్నాలజీ విభాగం భారీగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. హోదా రావడంపై క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ ఆచార్య డి.శ్రీనివాసులు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.దేవికా రాణిని పలువురు అభినందించారు.

పదిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

- బడి బయట విద్యార్థులపై దృష్టి సారించాలి
- మెగా డీఎస్సీ నిర్వహణలో ఒక్క ఫిర్యాదు రాకూడదు
- విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, హాజరైన విద్యాశాఖాధికారులు

కర్నూలు(సెంట్రల్): 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని, ఇందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విద్యాశాఖ, సమగ్రశిక్ష అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 62 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ ఏడాది ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు, ఎంఈఓలు ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. గతేడాది ఫలితాల్లో రెసిడెన్షియల్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో ఉత్తీర్ణత బాగుందని, జెడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం ఎందుకు తగ్గిందో విశ్లేషించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి పాస్ కావాలన్న లక్ష్యంతో మండలం, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు అవకాశం ఉందన్నారు. పోస్టుల భర్తీ అయ్యే వరకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో ఉపాధ్యాయులను నియమించడం, ట్యూటర్లను ఏర్పాటు చేసుకోవడం, వర్చువల్‌గా బోధన చేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓ శామ్యూల్‌ను ఆదేశించారు. మెగా డీఎస్సీలో కర్నూలు జిల్లాలో 2,645 పోస్టులను భర్తీ చేయనున్నామని, డీఎస్సీ నిర్వహణ అంశంలో ఒక్క ఫిర్యాదు లేకుండా సాఫీగా నిర్వహిచేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులు మధ్యలో బడి మానేయడంపై దృష్టి సారించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లలో అడ్మిషన్ల కోసం అర్జీలు వస్తున్నాయని, అన్ని పాఠశాలల అధికారులు సమావేశమై వారికి అడ్మిషన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థి కిట్లను వారంలోపు పంపిణీ చేయాలని ఆదేశించారు. విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం పేద విద్యార్థులకు ఇచ్చే సీట్లలో 979 మంది ఇంకా చేరలేదని, వారు చేరకపోతే ఆ సీట్లలో ఇతరులను చేర్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్, ఏడీ పాల్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇక ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు వీలుకాదు

● ఏపీఎస్పీడీసీఎల్ యాప్, బిల్‌డెస్క్ ద్వారానే బిల్లులు చెల్లించాలి

కర్నూలు(అగ్రికల్చర్): ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ఇక నుంచి కరెంటు బిల్లులు నేరుగా గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించుటకు వీలుకాదని విద్యుత్‌శాఖ అసిస్టెంటు అకౌంట్స్ ఆఫీసర్ మల్లికార్జున, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రామరాజు తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌ద్వారా లేదా ఏపీఎస్పీడీసీఎల్ బిల్‌డెస్క్ ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించాలని మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ఎలాంటి అదనపు రుసుము చెల్లించబడదన్నారు. అంతే కాకుండా ప్రతి ఒక్కరు వారి కరెంటు బిల్లుపై ఉన్న యజమాని ఫోన్ నంబరును చెక్‌చేసుకొని ఆ నంబరుతోనే రిజిష్టర్ కావాలని సూచించారు. ఈ వివరాలు సరి చూసుకోవాలని తప్పులు ఉంటే రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ ఆఫీసు (రూమ్ నెంబరు-1) నందు దరఖాస్తు చేసుకొని మార్చుకోవాలని తెలిపారు. ఆధార్ నంబరు మార్చుటకు జిరాక్స్ కాఫీ జత చేయాలని పేర్కొన్నారు.

బంగారు ఉంగరం అప్పగింత

మహానంది: కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీకాంత్, కుటుంబ సభ్యులు మంగళవారం మహానందికి వచ్చారు. ఈ సందర్భంగా వారు స్థానిక చిన్న కోనేరులో స్నానాలు ఆచరిస్తుండగా వారి వెంట వచ్చిన మహిళ చేతివేలికి ఉన్న బంగారు ఉంగరం కోనేరులో పడిపోయింది. ఈ విషయాన్ని వారు ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్థానిక చెంచు యువకులతో వెతికించి అప్పగించారు.

ఉపాధ్యాయుడు హఠాన్మరణం



నాగలక్ష్మయ్య (ఫైల్)

కొత్తపల్లి: విధుల్లో ఉన్న ఓ ఉపాధ్యాయుడు గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన మంగళవారం కొత్తమాడుగుల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూరు పట్టణంలోని తోటగిరిలో నివాసముంటున్న తోట నాగలక్ష్మయ్య (58) కొత్తపల్లి మండలం కొత్తమాడుగుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్. యథావిధిగా మంగళవారం విధులకు హాజరైన ఆయనకు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో హఠాత్తుగా ఛాతి నొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. గమనించిన విద్యార్థులు అక్కడే ఉన్న మరో ఉపాధ్యాయుడికి చెప్పడంతో ఆయన గ్రామస్తుల సహాయంతో అపస్మారక స్థితిలో ఉన్న నాగలక్ష్మయ్యను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు 98 డీఎస్సీలో క్వాలీఫై కావడంతో గతేడాదే ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. నాగలక్ష్మయ్య మరణ వార్త తెలియగానే మండల విద్యాశాఖ అధికారి శ్రీరాములు వైద్యశాల వద్దకు చేరుకుని సంతాపం తెలిపారు. కాగా మృతుడికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారు బోల్తా

● మహానంది ఎంఈఓకు గాయాలు

పాణ్యం: తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై కారు బోల్తాపడింది. ఈ ఘటనలో మహానంది ఎంఈఓ రామసుబ్బయ్యతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కర్నూలు నుంచి నంద్యాలకు వస్తుండగా మార్గమధ్యంలో కారు టైరు పగిలిపోవడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. గాయపడిన వారిని 108 వాహనంలో శాంతిరాం ఆసుపత్రికి తరలించినట్లు హైవే పోలీసులు తెలిపారు.

'పట్టు' సాధిస్తే లాభాలే!

● ఒక్కసారి మల్బరీ మొక్కలు నాటు కుంటే పదేళ్లు దిగుబడి
● పట్టుసాగుకు ప్రభుత్వం ప్రత్యేక రాయతీలు
● డిసెంబరు నెల వరకు మొక్కలు నాటుకోవచ్చు
● పట్టు పరిశ్రమ శాఖ డీడీ విజయకుమార్ సూచనలు



మల్బరీ సాగు చేసిన దృశ్యం (ఇన్‌సెట్), జిల్లా పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకులు విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): పట్టు పరిశ్రమరంగం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ఈ పంటసాగు పద్ధతులపై పూర్తి సాయి అవగాహన పెంచుకుని చేపడితే పండ్ల తోటలు ఇతర వాణిజ్య పంటలకంటే అద్భుతంగా రాణించవచ్చు. ఈ ఏడాది మల్బరీ సాగు ద్వారా పట్టు పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ఉమ్మడి జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కనీసం కర్నూలు జిల్లాలో 275 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 300 ఎకరాలు మొత్తంగా 575 ఎకరాల్లో మల్బరీ సాగు చేపట్టి దాదాపు 600 టన్నుల విదేశీ పట్టుగూళ్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో మల్బరీ సాగుకు ఎటువంటి భూములు అవసరం, వాతావరణం ఏ విధంగా ఉండాలి, మల్బరీ సాగు విధానం ప్రభుత్వపరంగా ఇచ్చే ప్రోత్సాహకాలను జిల్లా పట్టు పరిశ్రమ సహాయ సంచాలకులు ఐ.విజయకుమార్ (86395 00606)వివరించారు. పండ్ల తోటలు, కూరగాయల సాగు కంటే పట్టు పరిశ్రమ రైతులకు ఎక్కువ ఆదాయాన్ని ఇస్తుందని తెలిపారు. మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం తదితర వాటి గురించి ఆయన ఇలా వివరించారు.

సాగుకు అనుకూలం

ఖరీఫ్ సీజన్ మొదలై వర్షాలు పడుతున్నందున మల్బరీ మొక్కలు నాటుకోవడానికి ఇది మంచి అదును. డిసెంబరు వరకు మొక్కలు నాటుకోవచ్చు. ఇప్పుడు మొక్కలు నాటుకుంటే మొదటి సంవత్సరంలోనే రెండు పంటలు వచ్చే అవకాశం ఉంది. మల్బరీ సాగుకు ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 వరకు ఉన్న ఎర్రగరప నేలలు అనుకూలం. ఈ పంట సాగు మొక్కల్లో వీ-1 రకం శ్రేష్టమైనది. ఈ రకం మల్బరీ ఎకరాకు ఏడాదికి 20 నుంచి 25 టన్నుల ఆకు దిగుబడినిస్తుంది. నారు మొక్కలు ప్రభుత్వ క్షేత్రాలైన కొత్తపల్లి మండలంలోని నాగంపల్లె, మహానంది మండలంలోని గాజులపల్లె, కరివెన, తంగడంచె, వెంకటాపురం ప్రాంతాల్లో లభిస్తాయి. మొక్కలు నాటుకోవడానికి ఎకరాకు యూనిట్ కాస్ట్ రూ.30 వేలు ఉండగా... ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం అంటే రూ.27వేలు, ఇతరులకు 75 శాతం ప్రకారం రూ.22500 సబ్సిడీ కింద లభిస్తుంది. దుక్కిచేసి చివరి దుక్కిలో 8 టన్నుల పశువుల ఎరువు వేసి కలియ దున్నాలి.

మొక్కలు ఇలా నాటుకోవాలి...

ఇప్పటి వరకు జిల్లాలో మల్బరీ సాగు 3500 ఎకరాల్లో ఉంది. మల్బరీ మొక్కలను రెండు విధాలుగా నాటుకోవచ్చు. సాధారణ పద్ధతిలో 3''3 అడుగులు ప్రకారం నాటుకోవచ్చు. మూడు అడుగుల వెడల్పు, 3 అడుగుల పొడవులో నాటుకోవాలి. లేకపోతే ఇండో-జపాన్ పద్ధతిలో నాటుకోవచ్చు. దీని జోడుసాళ్ల సాగు పద్ధతిగా వ్యవహరిస్తారు. ఇందులో సాలుకు సాలుకు మధ్య అయిదు అడుగుల దూరం ఉండాలి. 3''2 అడుగుల దూరంలో మొక్కలు నాటుకోవాలి.

విదేశీ పట్టుగూళ్ల ఉత్పత్తికి ప్రాధాన్యత

జిల్లాల్లో విదేశీ(బైవోల్టెన్) పట్టుగూళ్ల ఉత్పత్తికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. స్వదేశీ పట్టుగూళ్ల ఉత్పత్తిలో100 గ్రుడ్లకు 50 నుంచి 55 కిలోల పట్టు గూళ్ల ఉత్పత్తి మాత్రమే ఉంటుంది. విదేశీ పట్టుగూళ్ల నాణ్యత ఎక్కువగా ఉంటుంది. 100గ్రుడ్లకు 70 కిలోల నుంచి 100 కిలోల వరకు పట్టు గూళ్ల ఉత్పత్తి అవుతాయి.

ప్రతి నెల పంట తీసుకోవచ్చు...

పట్టు సాగు సరైన పద్ధతిలో చేపడితే ప్రతి నెల పట్టుగూళ్ల దిగుబడి ఉంటుంది. పట్టుసాగుపై ఆసక్తి ఉన్న రైతులు ముందుగా అంటే జూలై, ఆగస్టు నెలలో ఒకటిన్నర ఎకరా, అక్టోబరు, నవంబరు నెలల్లో మరో ఒకటిన్నర ఎకరాల్లో మల్బరీ మొక్కలు నాటుకొని పట్టు పురుగుల పెంపకం చేపడితే ప్రతి నెల దిగుబడి ఉంటుంది. మామూలుగా అయితే ఏడాదికి 5 పంటలు తీయవచ్చు. రెండు దఫాలుగా మొక్కలు నాటుకుంటే 12 నెలలు పంటపొందే అవకాశం ఉంది. ఒక్కసారి మల్బరీ మొక్కలు నాటుకుంటే పదేళ్ల పాటు పట్టు పురుగులకు ఆకు లభిస్తుంది. మల్బరీ సాగును నీటి వసతి అత్యవసరం, సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించుకుంటే ప్రతి నీటి చుక్క సద్వినియోగం అవుతుంది. ఏపీఎంఐపీ ద్వారా సబ్సిడీపై సూక్ష్మ సేద్యం పొందవచ్చు. ఇప్పుడు మల్బరీ మొక్కలు నాటుకుంటే నాలుగు నెలలకు ఆకు సిద్ధమవుతుంది. పట్టు పురుగులు మల్బరీ ఆకులు మినహా ఇతరత్రా ఎటువంటి తినవు. నాలుగు నెలల్లో ఆకు వస్తే ఆ వెంటనే పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు చాకి కేంద్రాలు ఉన్నాయి. పట్టు పురుగుల్లో 5 దశలు ఉంటాయి. రెండవ దశ చాకి చేసిన పట్టు పురుగులను రైతులకు సరఫరా చేస్తారు. 3వ దశ నుంచి 5వ దశ వరకు రైతులు పెంచుకోవాల్సి ఉంది. మొదటి ఏడాది పట్టు పరిశ్రమలో 2 పంటలు, మరుసటి ఏడాది నుంచి 5 పంటలు వస్తాయి. జిల్లా బైవోల్టెన్, సంకర జాతి(సీబీ) పట్టు పురుగుల పెంపకం ఉంది.

పట్టు సాగుకు రేరింగ్ షెడ్లు

మల్బరీ, పట్టు పరిశ్రమ సాగులో రేరింగ్ గది అవసరం ఎంతో ఉంది. 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు ప్రకారం షెడ్ నిర్మించుకోవాలి. రేరింగ్ గది నిర్మించుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. గాలి, వెలుతురు బాగా వచ్చే విధంగా షెడ్లు ఉండాలి. రేరింగ్ షెడ్‌లకు పట్టు పరిశ్రమశాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ.3.60 లక్షలు, ఇతరులకు రూ.3 లక్షల సబ్సిడీ లభిస్తుంది. ఇది కాకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.2.98 లక్షల సబ్సిడీ లభిస్తుంది. వ్యాధి నిరోధకాలకు ఎస్సీ, ఎస్టీలకు రూ.4500, ఇతరులకు రూ.3750 సబ్సిడీ ఉంటుంది. పట్టు పురుగులు సున్నితంగా ఉంటాయి. అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకోలేవు. 25 నుంచి 28 డిగ్రీల వరకు మాత్రమే ఉష్ణోగ్రతలు ఉండాల్సింది. వేసవిలో వివిధ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా షెడ్‌లు చల్లని వాతావరణం ఉండేలా చూసుకోవాలి.

మహిళల ఆర్థిక విజయం స్ఫూర్తిదాయకం

● పొదుపు ద్వారా పేదరిక నిర్మూలన
● ఓర్వకల్లులో పొదుపులక్ష్మి ఐక్య సంఘం రజతోత్సవ మహాసభలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



రజతోత్సవ సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ఓర్వకల్లు: ఇక్కడి పొదుపు మహిళల ఆర్థిక విజయం ప్రపంచానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. మంగళవారం ఓర్వకల్లు బాలభారతి పాఠశాల ప్రాంగణంలో పొదుపులక్ష్మి ఐక్య సంఘం రజతోత్సవ మహాసభ నిర్వహించారు. అతిథిగా హాజరైన కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషాతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం మొదలైన పొదుపు ఉద్యమం నేడు మహావిప్లవంగా తయారైందన్నారు. మొదట నెలకు రూ.30 చొప్పున పొదుపు చేసిన ఒక్కో మహిళ..నేడు నెలకు రూ.1000 వరకు చేసుకునే స్థాయికి చేరుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. పొదుపు సంఘాల నిర్వహణతోనే పేదరికాన్ని జయించవచ్చని ఇక్కడి మహిళలు నిరూపించారని కొనియాడారు. తొలుత పదుల సంఖ్యలో మొదలైన పొదుపు సంఘాలు నేడు వేల సంఖ్యకు చేరడం గొప్ప విషయమన్నారు. మహిళలు తమ కాళ్లమీద నిలబడడంతో పాటు ఇతరుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునిస్తుండడం సంతోషకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ పొదుపు ద్వారా మహిళలు తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవడంతో పాటు పిల్లలకు మంచి భవిష్యత్ ఇస్తున్నారన్నారు. పొదుపు సంఘాల్లో చేరేలా మహిళలను చైతన్య పరచడంలో విజయభారతి కృషి మరువలేనిదన్నారు. ఇక్కడి మహిళలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా వినియోగించుకుని మరింత ఆర్థికంగా బలపడాలని కోరారు. అంతకు ముందు 30 ఏళ్లలో పొదుపు మహిళలు సాధించిన ఆర్థిక విజయాల గురించి మహిళా సమాఖ్య సంఘం గౌరవ సలహాదారురాలు విజయభారతి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ మల్లెల రాజశేఖర్, తహసీల్దార్ నటరాజన్, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఏపీఎం వెంకటరామిరెడ్డి, నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన పొదుపు మహిళలు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి



ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ నరసప్ప

ఆలూరు: యూపీకి చెందిన ముగ్గురు యువకులు ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేశారు. సోమవారం రాత్రి హత్తిబెళగళ్ క్రాస్ రోడ్డు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా రాయదుర్గంకు చెందిన నరసప్ప వ్యక్తిగత పనిమీద అప్పి ఆటో వేసుకుని కర్నూలుకు వచ్చాడు. పని ముగించుకుని సోమవారం తిరిగి వెళ్తుండగా బళ్లారి చౌరస్తా వద్ద కర్నూలు నగరానికి చెందిన వినాయక్ బోర్‌వెల్ యజమాని చంద్రశేఖర్ ఆటో ఆపి తన వద్ద పనిచేసే యూపీకి చెందిన ముగ్గురు యువకులను చిప్పగిరిలో వదలాలని చెప్పాడు. బాడుగ వస్తుందని వారిని నరసప్ప ఎక్కించుకున్నాడు. మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు రాత్రి 8.30 గంటల సమయంలో ఆలూరు నుంచి చిప్పగిరి గ్రామానికి వెళ్లే హత్తిబెళగళ్ క్రాస్ రోడ్డు వద్ద ఆటో ఆపి పిడి బాకుతో చేతులు, మెడపై దాడి చేసి పరారయ్యారు. తీవ్ర రక్త గాయాలతో స్పృహతప్పి పడి ఉన్న నరసప్పను ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు గమనించి 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఆలూరు పోలీసులు మంగళవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దాడి ఘటనపై విచారణ కొనసాగుతుందని ఆలూరు ఎస్‌ఐ ఓబులేశు విలేకరులకు తెలిపారు.


నర్సరీల నిర్వహణకు లైసెన్స్ తప్పనిసరి



ఆలూరులో నర్సరీ నిర్వాహకురాలికి నోటీసు ఇస్తున్న ఉద్యాన శాఖ అధికారి రామాంజినేయులు

ఆలూరు రూరల్: నర్సరీల నిర్వహణకు లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలని కర్నూలు జిల్లా ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు రామాంజినేయులు అన్నారు. మంగళవారం ఆయన ఆలూరు హార్టికల్చర్ అధికారిణి ఇందిరాతో కలిసి నర్సీల లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నిర్వహణ చట్టం 291 ప్రకారం నర్సరీల ద్వారా నారు పెంచే నిర్వాహకులు ఉద్యాన శాఖ నుంచి అనుమతులు పొందాలన్నారు. సీఎఫ్‌ఎంఎస్ ద్వారా రూ.1,000 చెల్లించి లైసెన్స్ పొందాలన్నారు. అలాగే రైతులకు నాణ్యమైన నారు విక్రయించాలని సూచించారు. నాసిరకమైన నారు విక్రయిస్తే అనుమతులు రద్దు చేస్తామన్నారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 25 నర్సరీలు ఉన్నాయని ఇందులో 18 నర్సరీలకు లైసెన్స్‌లు ఉన్నాయన్నారు. మిగతా వాటి నిర్వాహకులకు లైసెన్స్ తీసుకోవాలని నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

శిశువు మరణంపై డీసీహెచ్ఎస్ విచారణ



వివరాలు సేకరిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ మాధవి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రిలో శిశువు మరణానికి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి నిర్లక్ష్యమే కారణమని అందిన ఫిర్యాదుపై డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆర్. మాధవి మంగళవారం విచారణ చేపట్టారు. సూపరింటెండెంట్‌తో పాటు డ్యూటీ డాక్టర్, శిశువు తల్లిదండ్రులను విచారించారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. డాక్టర్ మైత్రేయి లేటుగా సిజేరియన్ చేయటం వల్లే తన బిడ్డ చనిపోయిందని అక్తర్‌బాను వాపోయారు. జరిగిన ఘటనపై డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ 'గత నెల 22వ తేదీన అక్తర్‌బానుకు సిజేరియన్ చేయగా మగ శిశువు జన్మించారు. అయితే బాబు పుట్టిన కొన్ని గంటలకే సీరియస్ కావటంతో ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. ఇందుకు అసలు కారణం ఏమి అనేది విచారణ చేస్తున్నా'మని వెల్లడించారు. బాధితురాలి ఫిర్యాదుపై డాక్టర్ సంజాయిషీ తీసుకుంటామన్నారు. పూర్తి నివేదికను పై స్థాయి అధికారులకు పంపుతామన్నారు.

చిన్న పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కృష్ణగిరి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

కృష్ణగిరి: చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీళ్ల విరేచనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.ప్రవీణ్‌కుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు వచ్చే వ్యాధుల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నీళ్ల విరేచనాలు అవుతుంటే ఓఆర్ఎస్ ద్రావణం తాపించాలని, అలాగే తల్లి పాలు ఆపకుండా పట్టించాలన్నారు. వీటితోపాటు జింక్ మాత్రలు ఇవ్వాలన్నారు. గ్రామస్థాయిలో ఉండే ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులైన అతిసారా, డెంగీపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు 31 వరకు అతిసారా నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఈ నెల 31 వరకు గ్రామాల్లో డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ కన్సల్టెంట్ సుమలత, వైద్యాధికారులు ప్రదీప్, శ్రీవాణి, ఆరోగ్య విస్తరణ అధికారి గజేంద్రారెడ్డి, సూపర్‌వైజర్ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

– తప్పిన ప్రాణ నష్టం



దగ్ధమైన ఇల్లు



బాధిత కుటుంబం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని పుల్లగుమ్మి గ్రామంలో మంగళవారం ఓ ఇంటిలో (మట్టిమిద్దె) గ్యాస్ సిలిండర్ పేలింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈఘటన జరగడంతో ప్రాణ నష్టం తప్పింది. వివరాలు.. సామన్న మంగళవారం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లాడు. కొద్ది సేపటికి ఇండేన్ కంపెనీకి చెందిన గ్యాస్ సిలిండర్ ప్రమాదశాత్తు పేలింది. ఈ ఘటనలో ఇంటి పైకప్పు ఎగిరిపోయి మంటలు వ్యాపించాయి. గమనించిన చుట్టుపక్కల వారు డోన్ ఫైర్ సిబ్బందికి సమాచారమందించారు. వారు హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న గ్యాస్ సిలిండర్ ఏజెన్సీ సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఆర్‌ఐ మస్తాన్, వీఆర్‌ఓ ఎల్లకృష్ణ సంఘటనా స్థలికి చేరుకుని నష్టాన్ని అంచనా వేశారు. ఇంట్లో దాచిన రూ.లక్ష నగదు, 5తులాల బంగారు, విలువైన వస్తువులు కాలిబూడిదైనట్లు బాధితుడు తెలిపాడు. ప్రమాదానికి గ్యాస్ లీకేజీనా? కరెంట్ షార్ట్ సర్క్యూటా? లేక మరేదైనా కారణమా తెలియాల్సి ఉంది.

డోన్‌లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న బీరువాలోని వస్తువులు

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ఉన్న ఓ ఇంట్లో దొంగలు చొరబడి రూ.4 లక్షలు విలువ చేసే బంగారం,వెండి వస్తువులతో పాటు రూ. లక్ష నగదు, రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. పాతబస్టాండ్‌లో ఫారూక్ ఎలక్ట్రానిక్స్ షాప్ యజమాని అయిన ఖాదర్‌బాషా శ్రీరామ్‌నగర్‌లో నివసిస్తారు. జూన్ 29వ తేది ఇంటికి తాళం వేసి కర్నూలులో చదువుతున్న పిల్లల వద్దకు భార్యతో కలిసి వెళ్లాడు. సోమవారం రాత్రి తిరిగి వచ్చిన ఆయనకు ఇంటి కిటికీ గ్రిల్ తొలగించి ఉండటం కనిపించింది. వెంటనే ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడు తులాల బంగారు నగలు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదు, రెండు కొత్త సెల్ ఫోన్లు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

శిక్షణతో బోధన నైపుణ్యాల మెరుగు



మాట్లాడుతున్న శిక్షణ రాష్ట్ర పరిశీలకురాలు శారదాదేవి

పత్తికొండ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు ఇస్తున్న 9 రోజుల శిక్షణ బోధనా నైపుణ్యాలు పెంచేందుకు దోహదపడుతుందని టీచ్ టూల్ శిక్షణ రాష్ట్ర పరిశీలకురాలు శారదాదేవి అన్నారు. పత్తికొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కోర్సు డైరెక్టర్ ఎంఈఓ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. నాణ్యమైన విద్యనందించేందుకు శిక్షణ ఎంతో తోడ్పడుతుందన్నారు. పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, ఆలూరు, దేవనకొండ, చిప్పగిరి, ఆలూరు, మండలాల పరిధిలో ఎంపిక చేయబడిన ఉపాధ్యాయులు శిక్షణలో తప్పకుండా పాల్గొనాలని సూచించారు. 7 మండలాల పరిధిలో 78 మంది టీచ్ అబ్జర్వర్‌లు తయారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు వీరాంజినేయులు, రంగన్న, అగస్టీన్, నాగరాజు, మండల పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు బడేసాహెబ్, పరమేష్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు ప్రసాద్, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కోడుమూరు రూరల్: ఆర్‌టీసీ బస్సు కింద పడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మంగళవారం కోడుమూరులో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలు..వ్యక్తిగత పనిమీద కృష్ణగిరి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన తిమ్మరాజు (20) స్నేహితుడు రంగస్వామితో కలిసి బైక్‌పై కోడుమూరుకు వచ్చారు. స్థానిక శ్రీరాములవారి దేవాలయం వద్ద ముందు వెళుతున్న ఆర్‌టీసీ బస్సును రాంగ్ రూట్‌లో ఓవర్ టేక్ చేస్తూ అదుపు తప్పి బస్సు కింద పడ్డారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న రంగస్వామికి ఎలాంటి గాయాలు కాలేదు. వెనుక కూర్చున్న తిమ్మరాజుకు మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. ఈ మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది.